భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

శంషాబాద్: భూమికి సంబంధించిన పలు సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రవీందర్‌దత్ తెలిపారు. పట్టణంలోని కిషన్‌గూడలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. రెవెన్యూలో ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. రైతులు, భూ యజమానులు రెవెన్యూ పరంగా ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పలు అర్జీలను ఆయన స్వీకరించారు.

పోరాటాలతో సమస్యల పరిష్కారం

శంషాబాద్: పోరాటాలతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.చంద్రయ్య అన్నారు. జిల్లా అధ్యక్షుడు రామస్వామి అధ్యక్షతన శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర సర్కారు కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందన్నారు. పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందన్నారు. దీంతో శ్రమజీవులు పూర్తిగా అన్యాయానికి గురవుతున్నారన్నారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాసేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదన్నాయన దుయ్యబట్టారు. ప్రధాన కార్యదర్శి పి.పర్వతాలు, సామిడి శేఖర్‌రెడ్డి, నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

'నిషా'చరులపై కేసుల నమోదు



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం కిస్మత్‌పూర్ బ్రిడ్జి వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలను నడిపిన 20 మంది తనిఖీల్లో పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వివాదాస్పదంగా హెల్త్ అసిస్టెంట్ తొలగింపు

రాజేంద్రనగర్: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హెల్త్ అసిస్టెంట్‌ను తొలగించడం చర్చనీయాంశంగా ఒకింత వివాదాస్పదంగా మారుతోంది. నగరంలోని వివిధ జీహెచ్‌ఎంసీ సర్కిళ్ల పరిధిలో నకిలీ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను జారీ చేశారు. నార్సింగ్ మున్సిపల్ కార్యాలయంలో దొరికిన ఒక సర్టిఫికెట్ ఆధారంగా విచారణ చేయగా జీహెచ్‌ఎంసీ పరిధిలో దాదాపు 29 వేల నకిలీ పత్రాలు జారీ చేసినట్లు అధికారులు గుర్తించి వాటన్నింటినీ రద్దు చేశారు. ఇందుకు గాను ఆయా సర్కిల్ కార్యాలయంలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, హెల్త్ అసిస్టెంట్‌లను టర్మినేట్ చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో హెల్త్ అసిస్టెంట్‌గా వికాస్ విధులు నిర్వహిస్తున్నాడు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి నుంచి ఎలాంటి జనన, మరణ నకిలీ ధ్రువీకరణ పత్రాలు జారీ కాలేదు. అయినా వికాస్‌ను టర్మినేట్ చేయడం పట్ల తోటి ఉద్యోగులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి

గోల్కొండ: బుల్కాపూర్ నాలాతో పాటు ఇతర నాలాలను వెంటనే పరిశీలించి పూడికతీత పనులు చేపట్టాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన ఎస్‌ఎన్‌డీపీ ఈఈ కోటేశ్వర్‌రావు తదితరులతో కలిసి నాలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..హకీంపేట్ మీదుగా ప్రవహించే బుల్కాపూర్ నాలా ప్రతియేటా వర్షా కాలంలో పొంగిపొర్లుతూ వేలాది కుటుంబాలను ఇబ్బందులు పెడుతుందన్నారు. వెంటనే ఈ నాలాలో పూడికతీత పనులు చేపట్టి నాలాకు ఇరువైపులా గట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఈఈ రెడ్డి, ఇతర ఎస్‌ఎన్‌డీపీ అధికారులు, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, ఏకే పఠాన్ తదితరులున్నారు.



హకీంపేట్ నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్ తదితరులు

నిఘా నేత్రం.. 'దృష్టి'లోపం!

మణికొండ: ప్రజల భద్రతకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అవి. వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో అవి ఎటో చూస్తూ దర్శనమిస్తున్నాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని సెక్రటేరియట్ కాలనీ గోల్డెన్ టెంపుల్ సర్కిల్‌లో ఒకే పోల్‌కు పదికి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎటు నుంచి ఎవరు వచ్చినా వాటిల్లో నిక్షిప్తం అయ్యేలా వాటిలో ప్రోగ్రామింగ్ ఉటుంది. వాటి ఫుటేజీ నేరుగా నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో నిక్షిప్తం అవుతుంది. లక్షలాది రూపాయలను వెచ్చించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. నేరాల నివారణ.. కేసుల సత్వర పరిష్కారానికి ఎంతో ఉపకరించే కెమెరాల నిర్వహణ.. ప్రజలకు భద్రత కల్పించాల్సిన యంత్రాంగం లేక పోవటంతో అవి అచేతనంగా ఉన్నాయి. ఇకనైనా పోలీసులు స్పందించి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రధాన రోడ్లపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను సరిగా పనిచేసేలా చేసి నేరాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.





గోల్డెన్ టెంపుల్ సర్కిల్‌లో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

ముస్తాబైన సులేమాన్‌నగర్‌లోని జామీయా మసీదు



శాస్త్రిపురం మసీదు లోపల వేసిన షామీయానాలు



బక్రీద్ ప్రార్థనలకు సర్వం సిద్ధం

- మసీదులు, ఈద్గాల ముస్తాబు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

శాస్త్రిపురం: త్యాగానికి ప్రతీకగా ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకొనే బక్రీద్ పర్వదిన ప్రార్థనలకు రాజేంద్రనగర్ ముస్తాబైంది. సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్‌ల పరిధిలో ముస్లింలు ప్రార్థనలు చేసుకునేందుకు మసీదులు, ఈద్గాల నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. బక్రీద్ రోజున నిర్వహించే ఈద్-ఉల్-జుహా ప్రత్యేక నమాజ్‌ను చేసేందుకు అవసరమైన వసతులు కల్పించారు. శనివారం ఈద్గాలు, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వారి పితృదేవతలకు గుర్తుచేసుకొని అన్నదానాలు చేసేందుకు పలువురు ముస్లింలు ఏర్పాట్లు చేసుకున్నారు. బక్రీద్ కోసం ఇప్పటికే ప్రభుత్వంలోని వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. బస్తీలలో పారిశుద్ధ్య పనులు, డ్రైనేజీలకు మరమ్మతులు చేశారు. ఈద్గాలలో పెరిగిన పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించి ప్రార్థనల నిర్వహణకు అనుగుణంగా చదును చేశారు. బక్రీద్‌ను ప్రశాంత వాతావరణంలో , సుఖసంతోషాలతో జరుపుకోవాలని ముస్లిం పెద్దలు సూచించారు.



మహ్మదీయ ఈద్గాను జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

ప్రార్థనలు నిర్వహించే ప్రాంతాలివే..

రాజేంద్రగనర్ సర్కిల్ పరిధిలోని సులేమాన్‌నగర్, శాస్త్రిపురం డివిజన్‌లోని మదీనా మసీదు, హసన్‌నగర్‌లోని అక్సరే మసీదు ఈద్గా, మహ్మదీయ ఈద్గా, దర్గాకే మసీదు, నౌనంబర్‌లోని జామీయ మసీదు, జామీయ మసీదు హబీబియా, ఇంద్రానగర్ ఈద్గా, నూరానీ మసీదు, వాదియామహ్మద్‌లోని మసీదేముస్తాఫా మసీదు, మహ్మదాబాద్‌లోని మసీదేమహ్మదీయా మసీదులలో ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రార్థనల కోసం చత్రింగిలను పరిచి, షామీయాలను వేశారు. నమాజ్‌లకు వచ్చే ముస్లింల కోసం మంచినీరు, షామియానాలు, ఇతరత్రా వసతులను కల్పించారు. నిర్ధీత సమయం వరకు ప్రార్థనలకు హాజరు కావాలని మతపెద్దలు కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరకుండా పోలీసులు తగిన రక్షణ చర్యలు తీసుకున్నారు. అనుమానిత వ్యక్తులు, వస్తువులు కనపడిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసు ఉన్నతాధికారులు కోరారు.

పటిష్ట ఏర్పాట్లు: డీసీ రవికుమార్

రాజేంద్రనగర్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో భారీ ఏర్పాట్లు చేపట్టామని ఉప కమిషనర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో పాటు అదనంగా 53 మంది సిబ్బందిని, ఐదు జేసీబీలు, 21 డీసీఎంలను అనిమల్ వెస్టేజ్‌లను తరలించేందుకు అందుబాటులో ఉంచామన్నారు. శుక్రవారం రాత్రి నుంచే సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొంటారన్నారు. అనిమల్ వెస్టేజ్ కోసం 29 వేల ప్లాస్టిక్ కవర్లను పంపిణీ చేశామన్నారు. అనిమల్ వెస్టేజ్‌ను డంప్ చేసేందుకు కాటేదాన్, సులేమాన్‌నగర్, బండ్లగూడ ప్రాంతాల్లో తాత్కాలిక డంపింగ్ యార్డ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఆయా డీసీఎంలలో వ్యర్థాలను డంప్ యార్డ్ తరలిస్తామన్నారు. అక్కడి నుంచి జీహెచ్‌ఎంసీ డంప్ యార్డ్‌కు తరలించనున్నట్లు వెల్లడించారు. పారిశుద్ధ్య స్పెషల్ డ్రైవ్ శని, ఆది, సోమవారాలు మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. బక్రీద్ ప్రార్థనలకు ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. ప్రార్థనల మందిరాల వద్ద పారిశుద్ధ్య పనులను నిర్వహించి బ్లీచింగ్ పౌడర్‌ను వెదజల్లినట్లు వెల్లడించారు.

అల్కాపూర్ టౌన్‌షిప్‌లో బీఆర్‌ఎస్ నేతల పర్యటన

మణికొండ: బీఆర్‌ఎస్ మణికొండ నాయకులు గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 6 అబ్దుల్ కలాం పార్క్ పరిసర ప్రాంతం, పుప్పాలగూడ గ్రామ శ్మశానవాటికలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం పార్టీ మణికొండ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ... అబ్దుల్ కలాం పార్క్ పరిసర ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. నిత్యం దాదాపు 30 మంది విశ్రాంత అధికారులు, వయోజనులు పార్కు అభివృద్ధి కోసం శ్రమిస్తున్న విషయం అభినందనీయమన్నారు. మెహిదీపట్నం బస్సు డిపో నుంచి వైఎస్‌ఆర్ కాలనీ వరకు రవాణా సౌకర్యం ఉందని ఈ బస్సు సౌకర్యాన్ని అల్కాపూర్ టౌన్‌షిప్ రోడ్ నెంబర్ 30 వరకు పొడిగించాలన్నారు. పుప్పాలగూడ శ్మశానవాటిక అభివృద్ధి కోసం మున్సిపాలిటీ లక్షలు ఖర్చు చేసి కనీసం నీటి అవసరాలు ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. పుప్పాలగూడ శివనగర్ కాలనీ సర్వే నెంబర్ 161 మున్సిపల్ పార్క్ స్థలం కబ్జాకు గురై బహుళ అంతస్తు సముదాయం నిర్మాణం జరుగుతుంటే మున్సిపాలిటీకి చీమ కుట్టినట్లుగా లేదన్నారు. అల్కాపూర్ టౌన్‌షిప్‌లో వీధి శునకాల బెడద తీవ్రంగా ఉందన్నారు. టీం ఫోర్ బహుళ అంతస్తు సముదాయం వారు బాగా ఉన్న రోడ్డును తవ్వేసి వారి డ్రైనేజీ కనెక్షన్ వేసుకున్నారన్నారు. ఇప్పటికీ ఆ రోడ్డు నాలుగు సార్లు కుంగిపోవడం, చిన్నపాటి మరమ్మతులు చేయడం మున్సిపల్ అధికారులకు పరిపాటిగా మారిందన్నారు. పార్టీ నేతలు గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, సుమనళిని, షేక్ ఆరిఫ్, రమణమూర్తి, బాబు, చెరుకూరి బాలాజీ, యాలాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



టౌన్‌షిప్‌లో సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలు

కోకాపేటలో శివాజీ విగ్రహావిష్కరణ



శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: హిందూ పోరాట యోధుడు, మరఠా రాజ్య స్థాపకుడు వీర శివాజీ విగ్రహాన్ని నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌లు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... హిందువుల ఐక్యత, పరిరక్షణ కోసం శివాజీ రాజీలేని పోరాటం చేశారన్నారు. అలాంటి మహనీయుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. శివాజీ విగ్రహాలను గండిపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేయటం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్ రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్‌ముదిరాజ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.అంజన్‌కుమార్‌గౌడ్, బీజేపీ ఇంచార్జి నియోజకవర్గ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నార్సింగి మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, బీజేపీ అధ్యక్షుడు ఎం. నగేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మైలార్‌దేవ్‌పల్లి: సుశిక్షితులైన, అర్హులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లతో అన్ని ఉచితంగా విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని బాబుల్‌రెడ్డినగర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనిత పేర్కొన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బాబుల్‌రెడ్డినగర్ ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆర్పీలు, ఆశా వర్కర్లు, యువత భాగస్వామలయ్యారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అనిత మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలతో పోటీపడుతూ నాణ్యమైన విద్యను అందిస్తున్నాయన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధాయ్యులు విద్యార్థులకు ఉత్తమ విద్యా బుద్ధులు నేర్పిస్తున్నారన్నారు. మౌలిక వసతులతో పిల్లలకు సులభంగా అర్థమయ్యే పద్ధతుల్లో బోధన కొనసాగుతుందన్నారు. నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ కుమారస్వామి మాట్లాడుతూ... పిల్లల భవిష్యత్ ఉజ్వలంగా ఉండాలంటే బేసిక్ విద్య బలంగా ఉండాలన్నారు. సమాజంలో స్థిరమైన మార్పు రావాలంటే పిల్లలకు మంచి విద్యా వాతావరణం కల్పించడమే మార్గం అని వివరించారు. కార్యక్రమం చివర్లో విద్యా ప్రమాణాలపై చర్చ జరగడంతో పాటు తల్లిదండ్రుల నుంచి సూచనలు, అభిప్రాయాలు స్వీకరించారు. అంగన్‌వాడీ టీచర్లు అనిత, మాధవి, ఆర్పీ హేమలత, ఆశా వర్కర్లు రేణుక, లక్ష్మీ, మాన్యమ్మ, మంగ, ఉపాధ్యాయులు వినోద్, పార్వతి, విజేశ్వరి, హెల్పర్ సంగీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అనిత

చెత్తను వేరు చేసి అందించాలి

బండ్లగూడ: ప్రజలు తమ ఇళ్లల్లో ఉత్పన్నం అయ్యే వ్యర్థాలు, చెత్తను ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ కార్మికులకు తడి పొడి చెత్తగా వేరు చేసి అందించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. శుక్రవారం 16వ డివిజన్‌లోని శాంతినగర్ కాలనీలో తడి, పొడి చెత్త, హానికారకర చెత్తపై స్థానికులకు అవగాహన కల్పించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పరవేకుండా 6వ డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీలో మసీదు వద్ద కవర్లను పంపిణీ చేశారు. అలాగే 15వ డివిజన్‌లో వీధి కుక్కల బెడదను నియంత్రించేందుకు నిర్వహిస్తున్న ఏబీసీ ప్రక్రియను పరిశీలించారు. ఎస్‌ఐ జి.వెంకట్‌రెడ్డి, శానిటరీ జవాన్లు వెంకటేష్, మల్లేష్, కృష్ణ, లక్ష్మీనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.



పీఅండ్‌టీ కాలనీలో కవర్లను పంపిణీ చేస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి



అత్తాపూర్ హైస్కూల్‌లో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

అత్తాపూర్: పాఠశాలలకు విద్యార్థులను పంపించడంతో పాటు విద్యార్థుల పట్ల శ్రద్ధ తీసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యారాలు శ్రీలతసాయిప్రద్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌సాగర్ అన్నారు. ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ... మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్ సాకారం అయ్యేలా నాణ్యమైన విద్యను బోధించడమే బాధ్యతగా తీసుకుంటామని స్పష్టం చేశారు. పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికీ పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ పంపిణీ చేస్తారన్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా తమ పిల్లలను ఉన్నత చదువులు చదివే వరకు పెద్ద ఎత్తున సహకరిస్తాయని బతుకుదెరువు కోసం వచ్చిన పిల్లలతో పాటు స్థానికుల పిల్లలు కూడా పాఠశాలలో చేరేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించి ఉచితమైన నాణ్యమైన విద్యను పొందాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్, మాజీ కౌన్సిలర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో బడి బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన వసతులతోపాటు నాణ్యమైన విద్యాబోధన ఉంటుందన్నారు. నార్సింగి మార్కెట్ కమిట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుద్దోళ్ల శ్రీరాములు, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు గంగాధర్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి

సమస్యల ఒడిలో 'ఉర్దూ స్కూల్'

- అరకొర వసతులతో తప్పని ఇబ్బందులు
- కూలిన పాఠశాల ప్రహరీ
- లోనికెళ్తున్న ఆవారా యువకులు
- యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో సర్వత్రా ఆందోళన



గేటు లేని ప్రధాన ద్వారం



అపరిశుభ్రంగా మారిన మూత్రశాలలు

శాస్త్రిపురం: సరస్వతి నిలయం సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతోంది. పరిష్కరించాల్సిన అధికారులు మిన్నకుండిపోతుండటంతో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సైతం సతమతం అవుతున్నారు. సులేమాన్‌నగర్ డివిజన్ చింతల్‌మెట్‌లోని ఉర్దూ మీడియం పాఠశాలలో సమస్యలు తాండవిస్తున్నాయి. పాఠశాలకు ఉన్న ప్రహరీ కూలిపోవడంతో కనీస రక్షణ కరువైంది. ప్రధాన ద్వారంలో కూడా గేటు లేకపోవడంతో పాఠశాలలో ఎవరు పడితే వారు వచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో పాఠశాలలో నిత్యం ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రహరీ లేనందున విద్యార్థుల మూత్రశాలలను ఇతరులు వినియోగించుకుంటున్నారు. ప్రహరీకి ఓవైపు లోపలికి ఎవరూ వెళ్లకుండా స్థానికులే పరదాను ఏర్పాచే చేసినా ఆకతాయిలు రాత్రి వేళల్లో లోపలకి వెళ్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పరిసర ప్రాంతాల ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. కూలిన ప్రహరీని తిరిగి నిర్మించాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు స్థానికులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని చింతల్‌మెట్ ఉర్దూ మీడియం పాఠశాలలో వసతులు కల్పించి, రక్షణ గోడతో పాటు గేటుకు మరమ్మతులు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.



కూలిన పాఠశాల ప్రహరీకి తాత్కాలికంగా కట్టిన పరదా